ప్రజాశక్తి
సోమవారం 24 నవంబర్ 2025
5
కర్నూలు

'స్థానిక' రిజర్వేషన్లపై ఉత్కంఠ

సిఎం వ్యాఖ్యలతో గ్రామాల్లో హడావిడి

అభ్యర్థుల ఎంపికపై నాయకుల కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. మరో మూడు, నాలుగు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో ఉంటూ ఎన్నికలకు సిద్ధం కావాలంటూ సిఎం చంద్రబాబు ఇటీవల చేసిన వ్యాఖ్యలతో గ్రామాల్లో అప్పుడే హడావిడి మొదలైంది. అభ్యర్థుల ఎంపికపై నాయకులు కసరత్తు కూడా ప్రారంభించారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వచ్చేలా చూడాలని కొందరు నాయకులు ఎమ్మెల్యేల వద్దకు వచ్చి విన్నవిస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. రిజర్వేషన్ల కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న కేటగిరిని బట్టి రిజర్వేషన్ ఏవిధంగా వస్తుందో ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. కీలకమైన పంచాయతీలకు సంబంధించి రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చేటట్లు చూడాలని స్థానిక నేతలు ఎంఎల్ఎల వద్దకు క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పలుచోట్ల బిసి, ఎస్సీలకు కేటాయించాల్సిన స్థానాలను జనరల్‌కు కేటాయించే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా మేజర్ పంచాయతీలపై స్థానిక నేతలు తమకు అనుకూలంగా రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంఎల్ఎలు సైతం స్థానిక నేతలకు రిజర్వేషన్లపై భరోసా ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వాతావరణం నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 910 మంది పంచాయతీలు, 815 మంది ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి. 2020 మార్చి నాటికి పంచాయతీ ఎన్నికలు విడతలవారీగా పూర్తయ్యాయి. ఐదేళ్ల కాలం పూర్తవుతుండటంతో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించాలని ప్రభుత్వం చూస్తున్నట్లు సంకేతాలు ఉన్నాయి. గడిచిన సెప్టెంబర్ మూడో తేదీన ప్రీ ఎన్నికల షెడ్యూల్కు సంబంధించి ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. అందులో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. గడిచిన బుధవారం సిఎం చంద్రబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో మూడు, నాలుగు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో ఉంటూ ఎన్నికలకు సిద్ధం కావాలంటూ సూచించారు. దీంతో పంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించే అవకాశం ఉందనే అంచనాలు నెలకొన్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో హడావిడి మొదలైంది. అభ్యర్థిగా ఎవరిని నిలబెట్టాలనే కసరత్తు ప్రారంభించారు. జనరల్ కాకుండా బిసి, ఎస్‌సి రిజర్వేషన్ వస్తే ఎవరిని బరిలో దింపాలనే ప్రణాళికలు వేస్తున్నారు. ప్రస్తుతం బిసి రిజర్వేషన్లు కొనసాగుతున్న చోట ఎస్సిలకు కాకుండా జనరల్కు వచ్చేలా చేయాలని స్థానిక నాయకులు ఎంఎల్ఎలను కలుస్తున్న పరిస్థితి ఉంది. దీంతో రిజర్వేషన్లను ఇష్టానుసారంగా మార్చే అవకాశం ఉందా అంటూ బిసి, ఎస్‌సి నేతలు ఆరా తీస్తున్న కన్పిస్తోంది. ఒకవేళ రిజర్వేషన్ అనుకూలంగా రాకపోతే ఏం చేయాలనే లెక్కలు సైతం వేస్తున్నారు. రిజర్వేషన్ కోటా మహిళలకు వస్తే ఎవరిని నిలబెట్టాలనే చర్చలు సైతం సాగుతున్నాయి. జనవరిలో జనాభా లెక్కల ప్రక్రియ మొదలు కానుంది. అందుకు సంబంధించి కేంద్రం నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత పంచాయతీ ఎన్నికలు ఉంటాయా లేక సమాంతరంగా ఎన్నికల ప్రక్రియ సాగుతుందా అనే చర్చ సైతం నడుస్తోంది. ప్రీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తే డీలిమిటేషన్ ప్రక్రియ, రిజర్వేషన్ల ఖరారు, వార్డులవారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, రిటర్నింగ్ అధికారులను నియమించడం, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి ప్రక్రియ సాగాల్సి ఉంటుంది. జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకూ సమయం ఉంది. అప్పటి వరకూ ఆగి పంచాయతీ, జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తారా లేక పంచాయతీ ఎన్నికలను మార్చిలోపే జరిపేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఏదేమైనప్పటికీ గ్రామాల్లో మాత్రం పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది.

రిజర్వేషన్ మారినా పెత్తనం చేసేలా ప్రణాళికలు

పలు కీలకమైన పంచాయతీలకు సంబంధించి జనరల్ కేటాగిరికి వచ్చే విధంగా చేయాలని స్థానిక నేతలు ఎంఎల్ఎలకు చెబుతున్నారు. ఒకవేళ అలా జరగకపోతే పంచాయతీలో పెత్తనం పోకుండా ప్రణాళికలు సైతం రచిస్తున్నారు. ఎస్‌సి, బిసి కేటగిరికి వస్తే వార్డు మెంబర్ గెలిచి వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కించుకుని పంచాయతీపై పెత్తనం చేసేలా పలు గ్రామాల్లో నేతలు ఆలోచనలు సైతం చేస్తున్నారు. బిసి, ఎస్ సి అభ్యర్థులు గెలిచిన చోట సైతం తామే చక్రం తిప్పేలా వ్యూహాలు రచిస్తున్నారు. జనరల్ కేటగిరి కోటా వస్తే ఖర్చు భారీగా ఉంటుందని, అదే బిసి, ఎసిసి కేటగిరికి వస్తే తక్కువ ఖర్చు అవుతుందని, వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కించుకుని పెత్తనం చేయవచ్చుననే లెక్కలు సైతం మరికొందరు నేతలు వేస్తున్నారు. రిజర్వేషన్ల కేటాయింపును తమకు అనుకూలంగా చేసుకుని ముందుకు సాగాలనే యోచనలో నేతలు ఉన్నట్లు కనిపిస్తోంది. రిజర్వేషన్ల ప్రక్రియలో అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

- ఫేస్ కన్వర్షన్‌లో కర్నూలు నంబర్ వన్
- ప్రజాశక్తితో ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ ఆర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. లో ఓల్టేజ్ సమస్యను అధిగమించి మెరుగైన విద్యుత్ అందించేందుకు చేపట్టే ఫేస్ కన్వర్షన్‌లో రాష్ట్రంలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉన్నట్లు చెప్పారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

మీ ఉద్యోగ ప్రస్థానం ఎక్కడ ప్రారంభించారు?

ఎస్ఈ :1987 నుండి 91 వరకు అనంతపురంలో బీటెక్ చేశా చదువు పూర్తి అయిన వెంటనే 1991లో కడప జిల్లా ముద్దనూరులో ఉద్యోగంలో చేరా. ఏఈ మొదలుకొని అన్ని కేడర్లలో పనిచేస్తూ ప్రస్తుతం ఎస్ఈగా ప్రమోషన్ పొందా.

మొత్తం ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారు?

ఎస్ఈ : 666 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది ఏడీలు, 37 మంది ఏఈలు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్లలో పనిచేస్తున్నారు. 19 మంది కొరత ఉంది.

కర్నూల్ నగరంను ఎన్ని సబ్ డివిజన్లుగా చేశారు?

ఎస్ఈ : కర్నూల్ నగరంను రెండో సబ్ డివిజన్‌లుగా చేశారు. సబ్ డివిజన్ ఒకటి రోజా, ఫోర్ట్, ధర్మపేట,ప్రకాష్ నగర్, నెహ్రూ నగర్, కొత్తపేట మొదలుకొని గౌలిగేరి వరకు సబ్ డివిజన్ రెండులో గిప్సన్ కాలనీ ఓల్డ్ టౌన్, ఉస్మానియా కళాశాల, మాసం భాష దర్గా, వడ్డగిరి, భాస్కర్ నగర్, కలెక్టరేట్, హాస్పిటల్, బంగారు పేట భాగ్యనగర్ వరకు.

జిల్లాలో మొత్తం ఎన్ని విద్యుత్తు సర్వీసులులో ఉన్నాయి?

ఎస్ఈ : కమర్షియల్ 91,520 కనెక్షన్లు, గృహాల కనెక్షన్లు 6,86,15, పరిశ్రమలు 27, 309, ప్రభుత్వ కార్యాలయాలు 26,751, వ్యవసాయం 1,18,341
మొత్తం 9,51,448 కనెక్షన్లు ఉన్నాయి.

11 కెవి లైన్లు, సబ్ స్టేషన్, ఫీడర్లు ఎన్ని ఉన్నాయి?

ఎస్ఈ : 11 కెవి లైన్ లు 556, సబ్ స్టేషన్ లు 128, 11 కె.వి ఫీడర్లు 576 ఉన్నాయి.

2025 -26 సంవత్సరానికి గాను వ్యవసాయ కనెక్షన్లు ఎన్ని ఇచ్చారు?

ఎస్ఈ : 2025-26 సంవత్సరానికి గాను వ్యవసాయ కనెక్షన్లు 6000 ఇచ్చాము కొత్తగా దరఖాస్తులు వచ్చాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతుల భూముల్లో పంటలు ఉండటం వల్ల కనెక్షన్లు ఇవ్వడానికి వీలు కావడం లేదు.

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఎంత సమయంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెడుతున్నారు?

ఎస్ఈ : టౌన్‌లో అయితే 12 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 24 గంటలలోపు కొత్త ట్రాన్స్ఫార్మర్ బిగిస్తాము. కర్నూల్‌లో మూడు, పత్తికొండ ఒకటి, ఆదోని ఒకటి, ఎమ్మిగనూరు ఒకటి ట్రాన్స్‌ఫార్మర్ట్ రిపేరీ కేంద్రాలు ఉన్నాయి.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎంత మంది పనిచేస్తున్నారు?

ఎస్ఈ : అవుట్సోర్సింగ్ పద్ధతిలో 887 మంది ఉద్యోగులు వివిధ కేడర్లలో పనిచేస్తున్నారు. నెలలో ప్రతి రెండవ శనివారం మెయింటెనెన్స్ డే ను నిర్వహిస్తాము. అందుకోసం 666 మంది పని చేయాలి అయితే 320 మంది మాత్రమే ఉన్నారు. వారికి సంబంధించిన జీతాలు ప్రతినెల వారి అకౌంట్లో జమ చేయడం జరుగుతుంది.

ప్రజలకు నిరంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఈ : ప్రజలకు నిరంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు లో వోల్టేజ్ సమస్య నుండి అధిగమించేందుకు ఒక ఫేస్‌ను త్రీఫేస్‌కు కన్వర్ట్, త్రీఫేస్‌ను ఫైవ్ ఫేస్‌కు కన్వర్ట్ చేసి స్టేట్ ర్యాంకింగ్లో కర్నూలు నెంబర్ వన్‌గా ఉంది.

ప్రమాదాలు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఈ : వర్షాలు, గాలులు ఉన్న సందర్భాల్లో చెట్లు విరిగితీగలపై పడితే ప్రమాదాలు జరుగుతాయని భావించి అలాంటి సందర్భాల్లో వెంటనే కరెంటును బందు చేస్తున్నామని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సిబ్బంది 24/7 గంటలు వినియోగదారులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు.

విద్యుత్ శాఖలో పనిచేసే పదవి విరమణ చేసిన వారికి వారికి రావాల్సిన బెనిఫిట్‌లో ఆలస్యం అవుతున్నాయని చెబుతున్నారు కారణం ఏమిటి?

ఎస్ఈ : విద్యుత్ శాఖలో పని చేసి పదవి విరమణ పొందిన వారికి వీలైనంత త్వరలో కార్యాలయానికి వారి రికార్డులు సమర్పిస్తే వారికి రావలసిన బెనిఫిట్స్ అన్ని అందజేయడం జరుగుతుంది.

విద్యుత్ సేవలపై ఎవరికి ఫోన్ చేస్తే స్పందిస్తారు..?

ఎస్ఈ : విద్యుత్ సేవలను గురించి కర్నూలు ఆపరేషన్ సర్కిల్ నందు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశాం. కర్నూలు సర్కిల్ ఆఫీస్ (ఎల్ఎంసి) 7382614308, కర్నూల్ టౌన్ 08518-221919, ఆదోని 9502382145, ఎమ్మిగనూరు 7382787703 నంబర్లకు సంప్రదించినచో వినియోగదారుల సమస్యలు పరిష్కారం చేయబడును. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి కూడా సమస్య తెలియజేయవచ్చు.

26న రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కనీస మద్దతు ధరలు, రైతు కార్మికుల వ్యతిరేక బిల్లుకు వ్యతిరేకంగా లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఈనెల 26న రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు అధ్యక్షతన నిర్వహించారు. కె.ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడారు. రైతుల ఢిల్లీ మార్చ్ జరిగి ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసినకనీస మద్దతు ధరలు, రుణమాఫీ, విద్యుత్ ప్రైవేట్ కరణ తదితర హామీలు నెరవేర్చ లేదన్నారు. అందుకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు, లేబర్‌కోడ్లు రద్దుచేయాలని కార్మికులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో రైతులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వచ్చిన అరకొర పంటను మార్కెట్‌కు తీసుకొని పోతే కనీసం మద్దతు ధరలు అమలు కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది పత్తి దిగుమతి సుంకం ఎత్తివేయడం వల్ల పత్తి ధరలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. సోయాబీన్ మొక్కజొన్న పాలు పాల ఉత్పత్తులు పెద్ద ఎత్తున నరేంద్ర మోడీ ప్రభుత్వం దిగుమతి చేసుకోవడానికి ఒప్పందం చేసుకున్నదని అన్నారు. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తులు ధరలు పూర్తిగా పడిపోయాయని అన్నారు. ప్రభుత్వ సంస్థలు ఎక్కడ కూడా వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా కొనుగోలు చేయకుండా దళారులకు అప్పజెపుతున్నారన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

2025 విత్తన చట్టం బిల్లును తీసుకొని వచ్చి కంపెనీలకు మేలు చేయబోతుందన్నారు. స్వేచ్ఛ వాణిజ్యం ఒప్పందంలో వ్యవసాయ రంగాన్ని తాకట్టు పెట్టిందని అన్నారు. ఈ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అంచలంచెలుగా కార్మిక సంఘాలతో కలిసి అన్ని రైతు సంఘాలు కలిసి పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, సి.హనుమంతు, పి హనుమంతు, సహాయ కార్యదర్శిలు కృష్ణ, సూరి, జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు వీరన్న, వెంకటేశులు, ఈరన్న, అయ్యప్ప, బాషమధు తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతుల నుండి పత్తి కొనుగోలుకు సంబంధించి వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి హెచ్చరించారు. ఈ నెల 18 నుండి 22 వరకు లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో గూడూరు, కోడుమూరు, గోనెగండ్ల, దేవనకొండ, ఆదోని, కోసిగి తదితర మండలాల్లో ఉన్న పత్తి కమిషన్ ఏజెంట్లు, ట్రేడర్లు, వేజ్ బ్రిడ్జిలు, గిన్నింగ్‌ప్రెస్ యూనిట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. కొందరు వ్యాపారస్తులు ఉపయోగిస్తున్న తూకపు యంత్రాలు రీ-వెరిఫికేషన్,స్టాంపింగ్ గడువు దాటినవని గుర్తించి, లీగల్ మెట్రాలజీ చట్టం 2009లోని సెక్షన్ 8/25 , 30 ప్రకారం 12 కేసులు నమోదు చేసి, సంబంధిత కేసులను చట్టప్రకారం కాంపౌండ్ చేసి రూ. 90 వేల జరిమానాలు విధించామని కలెక్టర్ తెలిపారు. తూకాల్లో మోసాలు జరుగకుండా లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బాలోత్సవం లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

బాలోత్సవం లోగోను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : డిసెంబర్ 9,10 తేదీల్లో కర్నూలు మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో లో నిర్వహించే 5వ భాలోత్సవం లోగోను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదివారం ఆవిష్కరించారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య కూడా విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా, సాంస్కృతిక రంగాల్లో చిన్నారుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శించడానికి బాలోత్సవం ఒక అపూర్వమైన అవకాశ వేదిక అని పేర్కొన్నారు. ప్రతి విద్యాసంస్థ తమ విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి ధనుంజయ, కోశాధికారి రంగస్వామి, కమిటీ ఆఫీస్ బేరర్లు సురేష్ కుమార్, రమణా రెడ్డి, సుదీర్, ఎల్లాగువేరా, హేమంత్ కుమార్, సాయిఉదయ్,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్ష మినహాయింపు ఇవ్వాలి

- ఎంపీ బస్తిపాటి నాగరాజుకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటి డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు ఎంపీ బస్తి పార్టీ నాగరాజుకు యుటిఎఫ్ జిల్లా కమిటీ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. యుటిఎఫ్ సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా, జిల్లా నాయకులు మార్కు వెంకటేశ్వర్లు, షబ్బీర్, హనుమంతు లు పాల్గొన్నారు. ఇప్పటికే సర్వీస్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష పై మినహాయింపు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బూటకపు ఎన్‌కౌంటర్లపై సమగ్ర విచారణ అవసరం

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- వామపక్షపార్టీల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దేశంలో మావోయిస్టుల పైన జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను, మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న దమన కాండను వెంటనే విరమించి వారితో శాంతి చర్చలు జరపాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఆర్ భవన్ వామపక్ష నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి , ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం, సిపిఎం నగర కార్యదర్శులు రాముడు, రాజశేఖర్, ఎస్‌యుసి ఐ జిల్లా కార్యదర్శి నాగన్న, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి సుంకన్నలు పాల్గొన్నారు. బి .గిడ్డయ్య మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా అతని భార్యతో పాటు మరో ఆరుగురిని పోలీసులు పట్టుకొని విచక్షణారహితంగా కాల్చి చంపడమే కాకుండా ఎన్‌కౌంటర్ అని అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మావోయిస్టులు కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అటవీ సంపదను తమ అనుయాయులైన కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడం కోసం గిరిజనులకు అండగా ఉన్న మావోయిస్టులను హత మార్చడం దుర్మార్గమన్నారు, శత్రు దేశాలతో శాంతి చర్చలు జరిపే బిజెపి ప్రభుత్వం మన దేశ పౌరులై సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా దోపిడీ లేని సమాజం కోసం హక్కులు అందరికీ కావాలని పోరాడే మావోయిస్టులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 మార్చి చివరి నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామనడం అతని అవివేకానికి నిదర్శనం అన్నారు . మావోయిస్టులను చంపడం కాదని వారు లేవనెత్తిన సమస్యను పరిష్కరిస్తే నక్సలిజం రూపుమాపడానికి అవకాశం ఉంటుందని, నక్సలైట్లను చంపినంతమాత్రాన నక్సలిజం చావదన్నారు. అది కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా గుర్తించాలని సూచించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపకపోతే బిజెపి నియంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను పౌరహక్కులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్ ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసులు, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, జి.చంద్రశేఖర్, డి .శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

- సెట్కూరు సిఇఒ వేణుగోపాల్
- ముగిసిన జిల్లా స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని సెట్కూరి సిఇఒ డాక్టర్ కె.వేణుగోపాల్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలు సిస్టర్ స్టానిస్లాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షులు బిడి.సుధీర్‌రాజు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ప్రధాన కార్యదర్శి కాజాహుస్సేన్ చెకుముకి సంబరాల రిపోర్టును ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెట్కూరి సిఇఒ డాక్టర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ అభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం అత్యంత అవసరమన్నారు. శాస్త్రం మనుషులను ప్రశ్నించే ఆలోచన, వాస్తవాలను పరిశీలించే సామర్థ్యం, కార్యాకారణ సంబంధాన్ని అర్థం చేసుకునే శక్తిని ఇస్తుందన్నారు. ఈ భావజాలాన్ని బలపరచేందుకు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. వారు సమాజంలో ఇంకా కొనసాగుతున్న అపోహలు, మూఢ నమ్మకాల వల్ల జరిగే అనర్థాలను స్పష్టంగా చర్చించి, ప్రజలు నిజాలను శాస్త్రీయంగా పరిశీలించే అలవాటు కలిగి ఉండాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ కె.బడేసాహెబ్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం అంటే ప్రతి విషయాన్ని సాక్ష్యాలు, పరిశోధన, తార్కిక ఆలోచనల ఆధారంగా అర్థం ప్రజలు అంధ విశ్వాసాల బారిన పడకుండా ఉండాలంటే శాస్త్ర విద్య అందరికీ చేరాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. చెకుముకి సంబరాలులో 40 టీములు పాల్గున్నాయి , ప్రభుత్వ విద్య సంస్థలలో ప్రథమ స్థానంలో ఎపిజె అబ్దుల్ కలాం, ద్వితీయ స్థానంలో ఎపిజె అబ్దుల్ కలాం తృతీయ స్థానంలో పెద్ద కడుబూర్ ఎపి మోడల్ హై స్కూల్ స్థానాల్లో దక్కించుకున్నారు. ప్రైవేటు ప్రథమ స్థానంలో ఏథెనా ఇంగ్లీష్ మీడియం స్కూల్, ద్వితీయ స్థానంలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్, తృతీయ స్థానంలో సెయింట్ జోసెఫ్ హై స్కూల్ దక్కించుకున్నాయి. జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు టి.వెంకట్ రెడ్డి, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సాయి ఉదయ్, హుస్సేన్ పీరా జయరాజు, సుమన్,మద్దిలేటి, కె.శంకరయ్య, వెంకట్‌రెడ్డి, యాగటీశ్వరప్ప, హుస్సేన్, విజయ్ కుమార్, రఘుబాబు, ప్రజానాట్యమండలి సుబ్బరాయుడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆర్.కృష్ణయ్యను కలిసిన ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్

ప్రజాశక్తి-పత్తికొండ : హైదరాబాదులో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నివాసంలో ఆయనను పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ బిసిల సమస్యల గురించి అలాగే రిజర్వేషన్లపై చట్టసభల్లో పోరాటం కొనసాగించాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. బిసిల ఐక్యత కోసం మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు యాదవ్, ట్రైబల్ వెల్ఫేర్ అడ్వైజర్ కౌన్సిల్ నెంబర్ పి వెంకటపతి, తెలుగు రైతు సంఘం రాష్ట్ర నాయకులు నరసింహ చౌదరి, తెలుగు యువతరాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

ప్రిన్సిపల్‌కు వోసా అప్రీషియేషన్ అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : వెలుగోడు ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ నాగస్వామినాయక్‌ను సన్మానించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆయనకు ప్రత్యేక వోసా అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్ : విశాఖపట్నంలో ఈ నెల 22 , 23 తేదీల్లో జరిగిన ఎపి 10వ సబ్ జూనియర్, జూనియర్ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్- 2025 రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో జిల్లా స్విమ్మర్స్ ప్రతిభ కనబరిచి ఒక గోల్డ్, 5 సిల్వర్, బ్రాంజ్ 5 మొత్తం 11 మెడల్స్ సాధించారు. ఇందులో గ్రూప్ 1 బాలల, బాలికల విభాగంలో ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. గ్రూప్-1 బాలుర విభాగంలో దేవ్‌శృత్ సాయి 800 ఫ్రీ స్టైల్‌లోగోల్డ్, 50,100 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్, 400 ఫ్రీ స్టైల్ లో సిల్వర్, 200 మీటర్స్ ఫ్రీ స్టైల్‌లో బ్రాంజ్ మెడల్స్, బాలికల విభాగంలో పి.హేమలత 100 మీటర్స్ బటర్ ఫ్లై, 200 మీటర్స్ ఇండిజువల్ మిడ్లేలో సిల్వర్, 50, 100, 200 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్ లో బ్రాంజ్ మెడల్స్, గ్రూప్-2 బాలికల విభాగంలో కె.శృతి 200 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ప్రతిభ కనబరిచిన సిమ్మర్లను డిఎస్‌డిఒ భూపతిరావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహ ఆచారి, సెక్రెటరీ రామకృష్ణ యాదవ్, ట్రెజరర్ దస్తగిరి, జాయింట్ సెక్రెటరీలు రామకృష్ణ, శివరాజ్ అభినందించారు.

సమాజంలో మంచి నడివడితో మెలగాలి

ప్రజాశక్తి-సి బెళగల్ : సమాజంలో మార్పును కోరుతూ సత్‌ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ వేణుగోపాల్ రాజు రౌడీ సీటర్లకు సూచించారు. ఆదివారం స్టేషన్ లో వారికీ కౌన్సిలింగ్ ఇచ్చారు. కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని జీవితాలు గడపాలని ఆవేశం అనర్థాలకు దారి తీస్తాయని అన్నారు. సమస్యలు ఎదురైతే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.ప్రధానగా గొడవలకు వివాదాలకు దూరంగా ఉండాలని పిల్లలను చదివించుకొని ఆశయాలను, లక్ష్యాలను సాధించాలని కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఆదోని

రోగాలు రావడం సహజమని వాటి లక్షణాలు తెలుసుకొని నివారణ కొరకు మందులు వాడి ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని శిబిరం దాత కాకుబళ్ నాగేష్ తెలిపారు. అవోపా , వామ్, ఐఐఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత రక్తనాళాల వైద్య పరీక్షల, ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య పరీక్షా శిబిరము ఆదివారం అదోనిలోనిర్వహించారు. హైదరాబాద్ శు్రశుత ఫౌండేషన్ ఏషియన్ వ్యాస్కూలర్ హాస్పిటల్, నంద్యాల శాంతిరాం హాస్పిటల్, ఎన్టీఆర్ వైద్య సేవ సహకారంతో ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరంనకు 336 పేషెంట్లు హాజరై పై తెలిపిన వైద్య విభాగాలలో ఉచిత పరీక్షలు చేయించుకొని నిపుణులైన డాక్టర్లతో రోగ నివృత్తికి సలహాలు పొందారని ఆదోని అవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. శిబిరం దాత కాకుబల్ నాగేష్ మాట్లాడుతూ అర్హులైన వారికి, డాక్టర్ సలహా మేరకు రూ.4500 విలువైన కలర్ డాప్లర్, 2డి ఎకో టెస్ట్, రక్తనాళాల పరీక్షలు, ఎకో పరీక్షలు నిర్వహించి అవసరమైన 56 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తమై శాంతిరాం హాస్పిటల్ నంద్యాలకు తరలించామన్నారు, మున్సిపల్ హై స్కూల్ హెడ్మాస్టర్ మల్లికార్జున, ఏషియన్ వ్యాస్కూలర్ ఆస్పత్రికి చెందిన వ్యాస్కులర్ వైద్య నిపుణులు డాక్టర్ అనిల్, డాక్టర్ సాయి తేజ సురేంద్ర, శాంతిరాం ఆస్పత్రి నంద్యాలకు చెందిన డాక్టర్ సురేష్, అవోప నాయకులు, నాయకంటి రఘు, ఉపాధ్యక్షులు ప్రతాప్ ఈరన్న శెట్టి, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, మెంబర్లు రత్నయ్య, రాధాకష్ణ, మాకం శ్రీధర్, ఆంజనేయులు, నవత వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, శ్రీనివాసులు, పరుచూరి రఘు, అవోపా మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారి మమతా శ్రీ, నాయకంటి శ్రీదేవి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆదోని : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు.ఆయన మాట్లాడారు. ఆలూరు మండల కేంద్రంలో డిసెంబర్ 04,05, తేదీల్లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 50వ జిల్లా మహాసభల జయప్రదం చేయాలన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై భవిష్యత్తు ఉద్యమాలకు సంసిద్ధం కావాలన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని హాస్టల్లో నాణ్యమైన భోజనం ఇవ్వాలని మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంత భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమస్యలపై చర్చించి, కార్యాచరణ రూపొందిస్తా మన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్, శశిధర్, జగన్, నరసింహారెడ్డి, విజయ్, రాజు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీ మఠానికి బంగారు గొలుసు విరాళం

ప్రజాశక్తి మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి భక్తుల నుంచి బంగారు గొలుసు విరాళం ఇచ్చినట్లు శ్రీ మఠం మేనేజర్ వెంకటేష్ జ్యోషి తెలిపారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై విజయవాడకు చెందిన న్యాయవాది దుర్గంపుడి వేణుగోపాల్ రెడ్డి, సుధారాణి దంపతులు శ్రీ మఠం చేరుకొని గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళవారం హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీ మఠం మేనేజర్ వెంకటేష్ జోషికి బంగారు గొలుసును విరాళంగా అందజేశారు. ఎనిమిది గ్రాములు గల బంగారు గొలుసు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని దాతలు తెలిపారు. మేనేజర్ సిఫారస్‌తో ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించి శేష వస్త్రం పరిమళ ప్రసాదం అందజేశారు. వారి వెంట దాతల కుమారుడు గుణశేఖర్ రెడ్డి, కుమార్తె దేవి శ్రీ ,బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డే నారాయణ, సూపరిడెంట్ పురాణిక అనంతాచార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపి, ఎమ్మెల్యేలు మద్దతివ్వాలి : వైసిపి

ప్రజాశక్తి - ఆదోని : వెనకబడ్డ ఆదోని అభివృద్ధి కోసం చేపట్టిన దీక్షకు ఎంపి, ఎమ్మెల్యులు మద్దతు ఇవ్వాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తేర్నెకల్ సురేందర్ రెడ్డి కోరారు. ఆదోనిని జిల్లా చేయాలని, పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ ఆదోని పట్టణంలోని బీమాస్ కూడలిలో చేపట్టిన రిలే దీక్ష ఆదివారం 8వ రోజుకు చేరింది. దీక్ష శిబిరానికి మద్దతు ప్రకటించే వారికి పెద్ద హరివాణం మండల సాధన కమిటీ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి స్వాగతం పలికారు. ప్రముఖ న్యాయవాది పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యాయులు రఘురామయ్య, భాస్కర్, తిక్క స్వామి మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ.. ఆదోని ఉమ్మడి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, పార్టీల ఇన్‌ఛార్జీలు ఒకే తాటిపైకి వచ్చి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. పార్టీ జెండాలు పక్కనపెట్టి ఆదోని జిల్లా అజెండాతోనే ముందుకు సాగాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు రిలే దీక్ష శిబిరానికి మద్దతు ప్రకటించి భాగస్వామ్యం కావాలన్నారు.

44 గ్రామాలు ఒకే మండలం కావడంతో నిధుల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుందన్నారు. ఆదోని రూరల్ మండలాన్ని నాలుగు భాగాలుగా విభజిస్తే ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరమే అందుతాయన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటు అయితే ఆస్పత్రి స్థాయి పెరిగి హెల్త్ ప్రొఫెసర్లు స్పెషలిస్టులు వస్తారన్నారు. దీంతో పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఏ అవసరం ఉన్న కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని దీనివల్ల ఎక్కడ ప్రాంత ప్రజలు ప్రయాసలు పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఆదోని జిల్లా ఏర్పాటు చేసి మండలాలుగా విభజించాలన్నారు. మేజర్ గ్రామ పంచాయతీ పెద్దహరివాణంను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కోల్స్ చర్చ్ నూతన నాయకత్వం ఎన్నిక

అధ్యక్షునికి సాల్మన్, కార్యదర్శిగా అనిల్ నాథ్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన అధ్యక్షుడిగా సాల్మన్ , కార్యదర్శి గా అనిల్ నాథ్ ఎన్నికను ఆదివారం ఉదయం చర్చిలో అధికారికంగా ప్రకటించారు . ఇటీవల జరిగిన ఎన్నికల్లో కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ అధ్యక్షులుగా పాలక వర్గం ఎన్నికలు అధికారి ఎడి అబ్రహం లింకన్ నిర్వహించారు. ఏడు పదవులకు ఎన్నికలు నిర్వహించగా , పావురం, ద్రాక్షవల్లి ఎన్నికల గుర్తులు పోటీపడగా పావురంప్యానెల్ వారు ఏడు పోస్టులను కైవసం చెసుకొని విజయం సాధించారు. అధ్యక్షులుగా అన్నెపోగు సాల్మన్, కార్యదర్శిగా రెడ్డిపోగు అనిల్ నాథ్, కోశాధికారిగా ఎన్.చార్లెస్, యూత్ డైరెక్టర్‌గా డాక్టర్ పగడాల సుచిత్ర విజయ్, సండే స్కూల్ సూపరింటెండెంట్‌గా దాసరి స్వర్ణలత రాజ్, ప్రాపర్టీ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ థామస్, స్టాండింగ్ కమిటీ మెంబెర్ గా ఆర్ పి కిరణ్ కుమార్ విజయం సాధించారు. ఎన్నికైన వారిని ఎలక్షన్ ఆఫీసర్ లింకన్ అధికారికంగా ప్రకటించి, ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులు సాల్మన్, కార్యదర్శి ఆర్ఇ అనిల్‌నాథ్ మాట్లాడుతూ 107 యేళ్ల ఘన చరిత్ర కల్గిన కోల్స్‌చర్చ్‌కి సేవ చేయుటకు ఎన్నుకున్న సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సంఘం ఆధ్యాత్మికంగా, సాంఘికంగా, సామజికంగా సేవా కార్యక్రమాలు నిర్వహించి సంఘ అభివృద్ధి కి కషి చేస్తామన్నారు. ఎన్నికల వాగ్దానములను నెరవేర్చుతామన్నారు. ఎన్నికైన సభ్యులు 2025 - 2027 రెండేళ్లపాటు పాటుచర్చి పాలక సభ్యులు గా కొనసాగుతారని ఎలక్షన్ ఆఫీసర్ తెలిపారు.

ఆదోని జిల్లా కోసం సిఎంకు బహిరంగ లేఖ

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిని జిల్లా కేంద్రంగా చేయాలని అప్పుడే విద్య ఉద్యోగ, వైద్య సదుపాయాలు పూర్తిస్థాయిలో కలుగుతాయని, పరిశ్రమలు నెలకొల్పబడతాయని అందకు ముఖ్యమంత్రికి బహిరంగ లేఖలు రాయాలని ఇండియా హాజీ ఫౌండేషన్ అధ్యక్షులు ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా అయితే ఉపాధి ఊరిలోనే లభిస్తుందని, వలసలను నివారించ వచ్చని అన్నారు. ఆదోని ప్రాంతానికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుతాయని వివరిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక బహిరంగ లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. ఆదోని జిల్లా కేంద్రం కోసం ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఆదోని వాసులంతా ఈ ఉద్యమానికి కలిసి రావాలని, ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రికి లేఖలు రాయాలని కోరారు. ఆదోనిని జిల్లా కేంద్రంగా చేయాలని బలంగా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజాసంఘాలు వారు ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. అందువల్ల ముఖ్యమంత్రి కొత్తగా జిల్లాల ఏర్పాటు విషయాన్ని పునః సమీక్షించి ఆదోనికి న్యాయం చేయాలని తన లేఖలో కోరినట్టు ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉన్నవారని. ఖచ్చితంగా జిల్లా చేయాలని సూచించారు. కర్నూలుకు సుదూరంలో ఆదోని డివిజన్ ఉందని, అందువల్ల జిల్లా ఆవశ్యకత అవసరమన్నారు. ఆదోని జిల్లా అయితే ప్రజలకు ఇక్కడే అన్ని రకాల సేవలు అందుతాయని పారిశ్రామిక అభివృద్ధి యువతకు ఉద్యోగ అవకాశాలు అందుతాయని స్పష్టం చేశారు. దూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని అనేక పరిశ్రమలు నెలకొలబడతాయని తెలిపారు. వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి కేంద్రీకతంగా ఆదోని ప్రాంతం ఉందని ఇక్కడ సాగునీటి తాగునీటికి మంచి వనరులు ఉన్నాయని వాటిని సద్వినియం చేసుకొని జిల్లా కేంద్రం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముఖ్యంగా ప్రజలకు విద్య, వైద్యం అందుతాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సానుభూతితో న్యాయబద్ధంగా పరిశీలించి న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అందువల్ల ప్రపంచవ్తంగా ఉన్న ఆదోని లో పుట్టి పెరిగిన వారు తమ వంతుగా ముఖ్యమంత్రికి లేఖలు రాయాలని పిలుపునిచ్చారు.

అత్యుత్తమ స్థాయిలో వైద్య సదుపాయం

అంకుర అపెక్స్ హాస్పిటల్ ప్రారంభంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ఇటీవల కాలంలో అత్యుత్తమ స్థాయిలో వైద్య సదుపాయాలు కర్నూలులో ప్రజలకు అందుబాటులో ఉన్నాయని కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లో నూతనంగా నిర్మించిన అంకురఅపెక్స్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. హాస్పిటల్ ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ అధినేతలు డాక్టర్ రమణ, డాక్టర్ మల్లేశ్వరి లు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన హాస్పిటల్ లో అన్ని రకాల, అధునాతన వైద్య సదుపాయాలను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. తమ హాస్పిటల్ లో ప్రతి గురువారం రోగులకు అన్నదాన కార్యక్రమం కూడా చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకే వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పలువురు వైద్యులు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న హాస్పిటల్ అధినేతలుడాక్టర్‌రమణ, డాక్టర్ మల్లేశ్వరి

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-కోసిగి

కోసిగి మండలవంలోని రౌడీ షీటర్లుకు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం సిఐ బి.ఎ.మంజునాథ్, ఎస్ఐ రమేష్ రెడ్డిలు కౌన్సిలింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక శాంతి భద్రతల ప్రాముఖ్యతను వివరించి, గ్రామాల్లో కలహాలు, విభేదాలు, గొడవలు లేదా ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏవైనా అవాంఛనీయ సంఘటనల్లో పాల్గొనకూడదనన్నారు. కౌన్సెలింగ్ సందర్భంగా చట్టపరమైన బాధ్యతలను వివరించి, భవిష్యత్తులో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సమాజ శాంతి-భద్రతలను భంగపరచే చర్యలు చేపట్టినా, ప్రేరేపించినా, గుంపుల గొడవల్లో పాల్గొన్నా లేదా ప్రజలలో భయాందోళనలు కలిగించే చర్యలకు పాల్పడినా, వారిపై తప్పనిసరిగా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వ్యక్తి సమాజంలో బాధ్యతాయుతంగా, చట్టపరంగా, శాంతియుతంగా జీవించాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రత కోసం కషి చేస్తుందనన్నారు.

రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సిఐ మంజునాథ్

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి -మంత్రాలయం

మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీ మఠంలో కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బందావనాన్ని దర్శించు కొనేందుకు బారులు తీరారు. తుంగభద్ర నది తీరం నుంచి వచ్చిన భక్తులకు కొత్తగా ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా దర్శన అవకాశం కల్పించారు. భక్తుల రద్దీని దష్టిలో పెట్టుకుని శ్రీ మఠం మేనేజర్ ఎస్కె శ్రీనివాసరావు అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి శ్రీ మఠం ఆధ్యాత్మిక అభివద్ధి అధికారి హరి నాథ్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాల శ్రీఘ్ర దర్శన భాగ్యం కల్పించారు. పరిమళ ప్రసాదం విక్రయ కేంద్రాల వద్ద ఒక్కొక్కరికి రెండు ప్యాకెట్ల చొప్పున మాత్రమే భక్తులకు విక్రయించే ఏర్పాటు చేశారు.

ఘనంగా స్వర్ణ పల్లకోత్సవం

రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం ఘ నంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో సేవాదారులతో పల్లకిని మోయించి ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు.



నేటి నుండి సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి -దేవనకొండ : మండలంలో 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల సామాజిక తనిఖీలు సోమవారం నుండి ప్రారంభించనున్నట్లు ఉపాధి హామీ ఏపీవో రాజు నాయక్ ఆదివారం విలేకరులకు తెలిపారు. మొత్తం 3509 పనులకి గాను 11 కోట్ల 14 లక్షల 45 వేల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో జరిగిన పనులకు సామాజిక తనిఖీలు చేసి గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

<u>రెస్పాండెంట్స్ కు నోటీసులు</u>

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

కర్నూలు

ఐ.పి. నెంబర్ 26/2024

ఎ.లక్ష్మణరావు. ...పిటిషనర్

వర్సెస్

మేడ విజయ్ కుమార్ & 28 ఇతరులు. ...రెస్పాండెంట్స్

ఇందుమూలముగా కింద తెలిపిన రెస్పాండెంట్స్ కు తెలియజేయడమేమనగా పిటీషనరు తనను దివాలాదారుడిగా ప్రకటించమని ఘనమైన కోర్టులో పిటిషన్ దాఖలు చేసినాడు. రెస్పాండెంట్ కు కోర్టు నుంచి నోటీసులు పంపిననూ ఆ నోటీసులను మీరు తీసుకొనలేదు. కావున ఘనమైన కోర్టు వారు ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారీ చేయమని ఉత్తర్వు జారీ చేశారు. కావున రెస్పాండెంట్స్ ఈ ప్రకటన చూసిన వెంటనే వాయిదా తేదీనాడు, అనగా 16-12-2025 నాడు కోర్టు వారి ముందు హాజరై మీ ఆక్షేపణలు తెలుసుకోగలరు.

ఇట్లు,

పిటిషనర్ తరపు న్యాయవాదులు

డి. భాస్కర్ రెడ్డి ,

డి. సత్యనారాయణ రెడ్డి ,

కర్నూలు.

<u>Respondents :</u>

3.Murali Krishna, S/o: Ramakrishnayya,
S/o not known to the petitioner,
R/o. Nirmal Nagar,
Kurnool city and District.

4.T.Rajendra Kumar
W/o: not known to petitioner,
R/o: 51-8-2, Near RTC bus stand,
Bellary road, Kurnool City and Dist.

6.V.Jaya Chandra,
S/o.V.Venkata Ramana,
R/o. Ramalingeshwar Nagar,
A.P. Tourism Hotel line,
Kurnool city and District.

8.Dadepogu Sridhar,
S/o not known to the petitioner,
R/o. N.T.R.Nagar,
Third Line, Kurnool city and District

9.Gurunandi,
S/o not known to the petitioner,
R/o. Rajeev Nagar, Main Road,
Kurnool city and District

11.Prabhakar Reddy,
S/o not known to the petitioner,
R/o. Weaker Section Colony,
Kurnool city and District

12.C.Lokesh,
S/o not known to the petitioner,
R/o. 1 town, Main Road,
Kurnool city and District
Cell:9908368966.

14.Epuri Ravi Setty,
S/o not known to the petitioner,
R/o. Gururaghavendra Nagar,
Kurnool city and District
Cell:9440588544.

15.T.Sreenu,
S/o not known to the petitioner,
R/o.Nirmal Nagar, Third Line,
Kurnool city and District

18.V.Raju,
S/o not known to the petitioner,
R/o. Weaker Section Colony,
Kurnool city and District

21.B.Sudheer,
S/o not known to the petitioner,
R/o. Lakshmi Nagar,
Kurnool city and District
Cell:9010048765

25.Rama Chandra,
S/o not known to the petitioner,
R/o. N.T.R.Nagar,
Kurnool city and District
Cell:9494736194

27.O.Subba Raju,
S/o not known to the petitioner,
R/o. Weaker Section Colony,
Kurnool city and District.
Cell: 9963921135

28.Anusha,
W/o. not known to the petitioner,
R/o. Ganesh Nagar, Second Line,
Kurnool city and District

వాయిదా తేది : 16-12-2025

సత్యసాయి సేవలు శాశ్వతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సత్యసాయి బాబా చేసిన సేవలు శాశ్వతం అని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కర్నూలు ఎంపీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 166 దేశాల్లో సాయి సేవా సంస్థలు ఉన్నాయన్నారు. మనందరం కూడా బాబా ఆశయాలను పాటించాలన్నారు. ట్రస్ట్ సభ్యులు అందరికి మా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ బాబా సేవాసమితి వారు నిస్వార్థ, అంకితభావంతో సేవలు అందిస్తారనే విషయాలను విన్నామన్నారు. విద్యా సంస్థలను, వైద్యశాలను స్వయంగా సందర్శించామన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, సెట్కూర్ సిఇఒ వేణుగోపాల్, ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వరరెడ్డి, డిసిహెచ్ ఎస్ డాక్టర్ జప్రుల్లా, మలేరియా అధికారి నూకరాజు , ట్రస్ట్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, కన్వీనర్ అశోక్ కుమార్, పి.లక్ష్మీసరోజ, ట్రస్ట్‌సభ్యులు, పాల్గొన్నారు.

.సత్యసాయి జీవితం మహోన్నతమైనది

మద్దికేర: పుట్టపర్తి సత్యసాయిబాబా జీవితం మహోన్నతమైనదని మద్దికేర మండల ప్రముఖులు పారా ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మద్దికేర తహశీల్దార్ కార్యాలయంలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయిబాబా కేవలం ఒక ఆధ్యాత్మిక గురువుగా కాకుండా మానవ సేవకు మారుపేరుగా నిలిచారన్నారు. ఆయన స్థాపించిన సంస్థలు ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత సేవా సంస్థలల్లో ఒకటిగా పరిగణించారన్నారు. సేవారంగం ప్రధాన లక్ష్యం,విద్య నాణ్యమైన, ఉచిత విద్య ద్వారా జ్ఞానం నీతిని బోధించారన్నారు. వైద్యం ఉచితంగా అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ, వైద్య సేవలను అందించారన్నారు. తాగునీరు కరువు పీడత ప్రాంతాలకు, గ్రామాలకు ఉచితంగా తాగునీటి సరఫరా, చేశారన్నారు. ఎంపిడిఒ కొండయ్య, రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ రామదాసు, విఆర్ఒ రంగస్వామి, స్థానికులు పాల్గొన్నారు.

మద్దికేరలో సత్యసాయి జయంతి

సత్యసాయి జయంతి సభలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి , వేదికపై జెసి, డిఆర్ఒ తదితరులు

ఘనంగా సత్య సాయి జయంతి

మంత్రాలయం : సత్యసాయి బాబా శతజయంతి వేడుకను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి, నియోజక వర్గ ప్రత్యేక అధికారి జి. భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తహశీల్దార్ కె. రమాదేవి, మండల అభివృద్ధి అధికారి నూర్జహాన్, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున పాల్గొన్నారు.

చిప్పగిరి : సత్య సాయి బాబా అందించిన సేవలు మరువ లేమని, ఆయన అనంతపురం జిల్లాలో ఎన్నో గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించిన గొప్ప వ్యక్తి అని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ రంగనాథ్ బాబు, ఎంపిడిఒ అల్ల బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. సర్పంచులు గోవిందరాజులు, కొండా పురుషోత్తం, టిడిపి యువ నాయకులు కొండా రామాంజనేయులు, అశోక్ యాదవ్ పరిపాలనాధికారి శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు పాల్గొన్నారు.

కర్నూలు విద్యుత్ శాఖలో

కర్నూలు కార్పొరేషన్: కర్నూలు విద్యుత్ భవనం ప్రాంగణంలో భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల వేడుకను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగులందరూ సత్య సాయి సేవలను స్మరించుకున్నారు. ఎస్ఇ ఆర్ ప్రదీప్ కుమార్ మాట్లాడారు. ఆయన సేవలను కొనియాడారు. కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ మాట్లాడారు.



చిప్పగిరిలో సత్యసాయికి ఘనంగా నివాళి

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆస్పరి

షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధం అయిన సంఘటన మండల పరిధిలోని అట్టేకల్లు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు వికాస్ బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ షార్ట్ సర్క్యూట్ అయ్యి బీరువాతో పాటు ఇల్లు, బీరువాలో ఉన్న బట్టలు, రెండు లక్షల రూపాయలు నగదు, ఒకటిన్నర తులం బంగారం, ధాన్యం పూర్తిగా ఖాళీ పోయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అట్టేకల్లు గ్రామానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయిం ది. ప్రభుత్వం స్పందించి బాధ్యత కుటుంబానికి నష్ట పరిహారం ప్రకటించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

<u>ప్రజా ప్రకటన</u>

నా క్లైంట్ శ్రీమతి బొడ్డికూరి ఉమా భర్త సత్యనాద్ ఇంటి నెంబర్ 40-బి142 శ్రీనివాస నగర్, కర్నూలు. వారి తరపున కర్నూలు ప్రజలకు తెలియజేయడమేమనగా పంచలింగాల గ్రామ పరిధిలో ఉన్న పొలం య. 2.60 సెంట్లు U/Sy No.269/2 మరియు 269/2బి ప్లాటు రూపంలో విక్రయించుటకు వై. సుధాకర్ తండ్రి అయ్యస్వామి ఇంటి నెంబర్.69/304ఎ జోహరాపురం కర్నూలు నివాసించుచున్న వారికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ సంవత్సరము 2023 అక్టోబరు 21వ తేదీన డాక్యుమెంట్ నెంబర్ 13988/2023 నకు సంబంధించిన య 2.60 సెంట్లు భూమిని ప్లాటు రూపం 2 సంవత్సరముల వ్యవధిలో అనగా సంవత్సరము 2025 నాటికి పూర్తి గావించవలెను. కాని జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ గా ఉన్న వై.సుధాకర్ తండ్రి అయ్య స్వామి తనకు ఇచ్చిన అధికారం పూర్తిగానందున మరియు లావాదేవీలు సక్రమంగా వ్యవహరించనందున మరియు అతని నుండి ఆర్థిక నష్టం కలిగినందున అతనిచ్చిన పవర్ ఆఫ్ అటార్నీ 2025 సంవత్సరము అక్టోబర్ 7 తేదీన రద్దు కాబడినది డాక్యుమెంట్ నెంబర్ 9606/2025 ఇకమీదట ఎవరైనా ఎలాంటి లావాదేవీలు వై.సుధాకర్ గారితో జరిపిన నా క్లైంట్ శ్రీమతి బొడ్డికూరి ఉమా భర్త సత్యనాద్ గారికి ఎలాంటి సంబంధం లేదు నా క్లైంట్ ద్వారా తెలియజేయడం అయినది.

ఇట్లు

Rakop Eswaraiah

Advocate, Kurnool.

Cell : 9989492953

నేటి నుంచి 'రైతన్నా - మీకోసం' ప్రారంభం

-24 నుంచి 29 వరకు రైతుల పరామర్శ -3న ఆర్ఎస్ కె ల వద్ద వర్క్ షాప్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రైతన్నా - మీకోసం వారోత్సవాల కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎమ్మిగనూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల ఎఒ హేమలత ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 నుంచి 29 వరకు ఆరు రోజులపాటు రైతుల ఇంటింటికి వెళ్లి పరామర్శ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈనెల 30 నుంచి డిసెంబర్ 2 వరకు రైతుల ఇళ్ళ నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తారన్నారు. ఏడవ రోజు డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల వద్ద వర్క్ షాప్ నిర్వహించి రబీ 2025 -26, ఖరీఫ్-2026, రబి 2026- 27కు సంబంధించి యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయనున్నట్లు తెలిపారు. చివరగా ముఖ్యమంత్రి 5 సూత్రాలను వివరిస్తారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన గురించి రైతులకు వివరించనున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా రైతుల ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి రైతులందరూ సహకరించాలని కోరారు.

శిల్పా ఎస్టేట్‌లో సెల్ టవర్ నిర్మాణం ఆపాలి

-అభ్యంతరం తెలుపుతున్న కాలనీ వాసులు

-అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పట్టణంలోని శిల్పా ఎస్టేట్ కాలని లో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణం ఆపాలని శిల్పా ఎస్టేట్ కాలని వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 13 నుండి కాలని వాసులు తమ అభ్యంతరాలను మున్సిపల్ అధికారులకు తెలిపారు. జిల్లా కలెక్టర్,సబ్ కలెక్టర్,మున్సిపల్ కమిషనర్ తో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు.అయినప్పటికీ సెల్ టవర్ నిర్మాణం అలాగే కొనసాగిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. నిర్మాణాలను ఆపాలని అడిగితే మాకు అనుమతులు ఉన్నాయి అంటూ సమాధానం చెబుతున్నారు. సెల్ టవర్ ఏర్పాటు వలన కాలనీ వాసులు రేడియేషన్ కు గురై ప్రమాదం ఉంది. కాలనీ వాసులు అభ్యంతరాలను పరిగణలోకి తీసుకాకుండా నిర్మాణం చేస్తున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. నిభందనలు ప్రకారం కాలని వాసులు నుండి అభ్యంతరం లేదని సర్టిఫికెట్ తీసుకోవాలి. కానీ అలా చేయకుండా అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్,సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహశీల్దార్ శేషఫణి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి స్పందించి సెల్ టవర్ నిర్మాణం ఆపాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

ఎటిఎం డిపాజిట్ మెషన్(సిడిఎం)ఫోన్‌పే/యుపిఐను ఉపయోగించి కొంతమంది నేరగాళ్లు అక్రమ లావాదేవీలు చేయిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదివారం తెలిపారు. కొంతమంది వ్యక్తులు తెలియని వ్యక్తులను ఉపయోగించి ఎటిఎంలో డబ్బు జమ చేయండి,""ఈ నంబర్‌కు ఫోప్‌పే/యుపిఐ ద్వారా పంపండి,' 'కమిషన్ ఇస్తాం,' అంటూ ప్రజలను మోసాలకు గురి చేస్తున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్‌పి పేర్కొన్నారు. తెలియని వ్యక్తులచే డబ్బులను ఎటిఎం సిడిఎంలో డిపాజిట్ చేయవద్దన్నారు. తెలియని వ్యక్తుల కోసం ఫోన్‌పే, గూగుల్‌పే, /యుపిఐ ద్వారా డబ్బు పంపవద్దన్నారు. ఇవి మనీ లాండరింగ్ అండ్ సైబర్ నేరాలకు సంబంధించిన అక్రమ చర్యలన్నారు.

పాల్గొనే వ్యక్తి కూడా నేరానికి సహకరించినట్లు పరిగణించబడతారన్నారు. ఏ అనుమానాస్పద లావాదేవీలు గమనించినా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైమ్ 1930 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని, ఈ తరహా మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

నేటి రాజకీయ దర్పణం 'చైర్మన్ ' నాటకం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కాలం మారింది నాయకులు మారారు.. ఎన్నో రాజకీయ పార్టీలు వస్తున్నాయి. పోతున్నాయి... అయినా వ్యవస్థలో మార్పు రాలేదు... అంటూ రాజకీయాలకు దర్పణం చెప్పేదే చైర్మన్ నాటకమని పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం రాత్రి టిజివి కళాక్షేత్రంలో చైర్మన్ నాటకం ప్రదర్శించారు. నాయకులు పదవి కోసం తపన వచ్చిన తరువాత నిలుపుకోవడం కోసం తపన ఎన్నికల ఖర్చులు ఇటువంటి అంశాలను ఈ నాటకం ఎత్తిచూపుతుంది. ఈ నాటకం రసరంజని హైదరాబాదు వారు సమర్పించారు. కళాక్షేత్రం అధ్యక్షులు ఓబులయ్య స్వాగతం పలుకుతూ నాటక రచయిత కొడాలి గోపాలరావు శతజయంతి సందర్భంగా ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. 1962లో రచించిన ఈ నాటకం నాటి నేటి రాజకీయాలను ఎత్తిచూపుతుందని అన్నారు. చైర్మన్ డి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ కొడాలి గోపాల్‌రావు రచించిన చైర్మన్ లంకెబిందెలు, వంటి నాటకాలు తర్వాతికాలలో సినిమాలుగా వచ్చాయన్నారు. ఇటీవల చైర్మన్ నాటకానికి తెనాలిలో సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందన్నారు. 40 యేళ్ల నుంచి కెవి రమణా చారి రిటైర్డ్ ఐఏఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కళా సంస్థలు ప్రదర్శనలు ఇవ్వడానికి హైదరాబాదులో అవకాశం ఇచ్చారన్నారు. అనంతరం డి రామకోటేశ్వరరావు దర్శకులు మోహన్‌లను సన్మానించి రూ.35 వేల ప్రదర్శన పారితోషకం అందజేశారు.

చైర్మన్ నాటకంలో ఓ సన్నివేశం

చైర్మన్ నాటకంలో కృష్ణమూర్తి, డొక్కా బాచి, అవినాష్, మోహన్, శ్రీజ సాదినేని, ఘనపురం కెకె రెడ్డి , అఖిల్ పుండరీకం తదితరులు ప్రవేశించే నాటకం అందరిని ఆకట్టుకుంది.కన్వీనర్లు కెవి రమణ, కదిరి రమేష్, కార్యదర్శి యాగంటి ఈశ్వర్, ఉపాధ్యక్షులు సివిరెడ్డి, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని డిసిసి మాజీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. పార్టీ కోసం అంకితభావంతో కలిసి పని చేస్తానని తెలిపారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబురావు మాట్లాడుతూ నంద్యాల జిల్లా అధ్యక్షులు లక్ష్మి నరసింహయాదవ్‌తో ఎలాంటి అభిప్రాయ బేధం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో పెద్ద నాయకులే పార్టీలో సస్పెండయి మళ్ళీ పార్టీలోకి వచ్చి పార్టీలోన వేసిన విత్తనంమళ్లీ ఏదో ఒక రోజు మొలకెత్తుతుందన్నారు. తన సస్పెన్షన్‌ను ఎత్తి వేసినందుకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌కు, ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా మాకు ఎలాంటి అడ్డంకులు వచ్చినా కూడాకచ్చితంగా పోరాడతామన్నారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్‌జిలానిబాష, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం

మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సీ బజారన్న, ఒబిసి సెల్ జిల్లా అధ్యక్షులు డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఎస్‌సి సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేయాలి

- ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రభుత్వపాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం దష్టి సారించాలని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్‌టియు వార్షిక కౌన్సిల్ సమావేశం సలాం ఖాన్ ఎస్‌టియు భవన్ లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్ గోకారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు

మాట్లాడుతున్న మల్లు రఘునాథ రెడ్డి

రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. గత ఆరు సంవత్సరాలుగా విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. రాష్ట్ర మంత్రి నారాలోకేష్ జోక్యం చేసుకొని ఉపాధ్యాయ సంఘాలతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెట్‌పరీక్ష నుండి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకులు జి సూర్యుడు ఎన్.రమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.నాగరాజు, బి వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, బి.సుంకన్న, సీనియర్ నాయకులు శ్రీ ఈ.షన్మూర్తి, సి.రమేష్, హెచ్.తిమ్మన్న, షఫీ, జిల్లా ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు టికె.జనార్ధన్, ఐ.రామ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో కర్నూలు విద్యార్థి విజయం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాయలసీమ ఫిట్నెస్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్‌లో సాధన చేస్తున్న విద్యార్థి బికార్తీక్ టౌన్ మోడల్ ప్రభుత్వ పాఠశాలలో 10వ,తరగతి చదువుతూ తైక్వాండోలో రాణిస్తున్నాడు. ఈనెల 21 నుండి 23 వరకు ఉత్తర్ ప్రదేశ్ లోని బరేలి జిల్లాలో నిర్వహించిన 8వ క్యాడేట్ అండర్ 45 విభాగంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. వాసవి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని టిఎం గాయత్రి 41వ సీనియర్ అండర్ 53 విభాగంలో రన్నర్ గా నిలిచింది. భారత తైక్వాండో ఫెడరేషన్ అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్ మెడల్‌ను బహుకరించి అభినందించారు. భారత తైక్వాండో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాత్ కుమార్ శర్మ , తిరుమల జయపాల్ క్లాస్‌వన్ రెఫరీ , రెఫరీ చైర్మన్, టైక్వాండో శిక్షకుడు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

పార్టీలకు సమాన గుర్తింపు లభిస్తుంది

-ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో జనసేన పార్టీ నిర్వహించిన కాఫీ విత్ కార్యకర్త కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు వైసిపి అరాచక పాలనను అంతమోదించడానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ టిడిపి, జనసేన, బిజెపిల కూటమి ఏర్పాటుకు కృషి చేశారన్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న మూడు పార్టీలకు సమాన గుర్తింపుతో పాటు, పదవుల కేటాయింపుల్లో సమన్యాయం జరుగుతుందన్నారు. జనసేన కోడుమూరు నియోజకవర్గ నాయకులు సంధ్యవిక్రమ్, గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు కృష్ణ యాదవ్, గ్రామ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తి ఓబులయ్యకు ఘనసన్మానం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ –2025 అవార్డును అందుకున్న కర్నూలు టిజివి కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్యను కవులు కళాకారులు ఘనంగా సత్కరించారు. రచయిత గద్వాల ఈరన్న ఈ సందర్భంగా ఆయనపై రాసిన అక్షరాభినందనలు చదివి వినిపించారు. ముద్రికభాస్కర్, టిజివి కళాక్షేత్రం కార్యదర్శి యాగంటీశ్వర్, రమణ, డాక్టర్ కదిరి రమేష్, గాండ్ల లక్ష్మన్న, ఇనాయతుల్లా, సివిరెడ్డి పాల్గొన్నారు.

పెళ్లి వేడుకల్లో మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

మండల పరిధిలోని మంచాల, చిలకలడోణ, రచ్చుమర్రి గ్రామాల్లో జరిగిన పెళ్లి వేడుకల్లో మంచాల సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు వివాహ సందడిలో పాల్గొన్న ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్ళి పెద్దల ఆహ్వానం అందుకున్న ఆయన కళ్యాణ మండపం చేరుకున్న ఆయనకు పూల మాల వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తలంబ్రాల బియ్యంతో కొత్త జంటలకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుండి 'రైతన్నా..మీకోసం'

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో రైతన్న మీకోసం ఇంటింటా కార్యక్రమం సోమవారం నుండి డిసెంబర్ 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఉషారాణి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కుటుంబాలకు ప్రభుత్వం తీసుకుంటున్న నూతన చర్యలను నేరుగా చేరవేయడం, వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. రాబోయే రబీ, ఖరీఫ్ సీజన్ల కోసం సరైన ప్రణాళిక రూపొందించడం లక్ష్యంగా పెట్టుకొని నిర్వహించబడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలన్నారు.